# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు


రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 118 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం 22, నవంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# అదానీ లంచావతారం..

- ఐదు రాష్ట్రాల్లో ప్రభుత్వాధికారులకు 2029 కోట్ల రూపాయలు లంచాలు
- ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకున్న పవర్ సేల్ అగ్రిమెంట్‌తో ఈ లంచాలకు అంకురార్పణ
- ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూపు అమెరికా బ్యాంకులు, పెట్టుబడి దారుల నుంచి బిలియన్ డాలర్లను సమీకరణ
- గౌతమ్ అదానీకి న్యూమరో ఉనో, ద బిగ్ మేన్ మారుపేర్లు

హైదరాబాద్,(నమస్తే ఉదయం):

ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలోని న్యూయార్క్ జిల్లా కోర్టులో నమోదైన లంచాల కేసులో జగన్ సర్కార్ పాత్ర వెలుగుచూసింది. సోలార్ విద్యుత్ ఒప్పందాల కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ఐదు రాష్ట్రాల్లో ప్రభుత్వాధికారులకు 2029 కోట్ల రూపాయలు లంచాలు ఇవ్వాలని అదానీ నిర్ణయించిందని అమెరికా ప్రాసిక్యూటర్ కేసుపత్రాల్లో పేర్కొన్నారు.

2029 కోట్లలో ఆనాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ పెద్ద జగన్‌కే రూ.1750 కోట్లు చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని వెల్లడించింది. జగన్‌ను విదేశీ అధికారిగా అమెరికన్ ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఐదేళ్లు పాలించి అనేక కుంభకోణాలకు తెరతీసిన వైఎస్సార్సీపీ సర్కార్ హయాంలో మరో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అది కూడా అమెరికాలోని న్యూయార్క్‌లో కేసు నమోదైంది. సోలార్ విద్యుత్ సరఫరా కాంట్రాక్టుల కోసం గౌతమ్ అదానీ లంచాలు ఇచ్చారని న్యూయార్క్ జిల్లా కోర్టులో నమోదైన కేసులో పత్రాలను పరిశీలిస్తే జగన్ సర్కార్ ఎంతకు తెగించిందో స్పష్టంగా తెలుస్తోంది.

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో 7 గిగావాట్ల సౌర విద్యుత్ కొనేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకున్న పవర్ సేల్ అగ్రిమెంట్‌తో ఈ లంచాలకు అంకురార్పణ జరిగింది.

2021 జులై నుంచి 2022 ఫిబ్రవరి మధ్య సోలార్ విద్యుత్ కొనుగోలు చేసేందుకు సెకీతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గడ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందాల్లో ఒక్క ఆంధ్రప్రదేశ్ డిస్కంలు 7 వేల మెగావాట్లను సరఫరా

## గౌతమ్ అదానీపై అమెరికాలోని న్యూయార్క్ జిల్లా కోర్టులో కేసు

చేసేందుకు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2025 జనవరి నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని సెకీ చెప్పింది. అయితే అదానీ పవర్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌ను ఏపీకి సరఫరా చేయాలని సెకీ నిర్ణయించింది. 2021 అక్టోబరు 14న నాటి సీఎం జగన్ నివాసానికి వచ్చిన గౌతమ్ అదానీ చర్చలు జరిపిన తర్వాతే డిస్కంలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

మిగతా.. 2లో

## అదానీని అరెస్ట్ చేసే ధైర్యం మోదీకి ఉందా?

- అదానీ, మోదీ ఇద్దరూ ఒక్కటే
- అదానీని అరెస్ట్ చేయాల్సిందే
- సెకీ ఒప్పందాల్లో జరిగిన అవినీతిని బయట పెట్టాలి
- అదానీ విద్యుత్ అవినీతిపై పార్లమెంటు సమావేశాల్లో లేవనెత్తుతాం
- రాహుల్ గాంధీ డిమాండ్

ఢిల్లీ,(నమస్తే ఉదయం):

గౌతమ్ అదానీని అరెస్ట్ చేయాల్సిందేనని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దేశంలో ముఖ్యమైన ప్రాజెక్టులు అదానీకే ఏ విధంగా దక్కుతాయని రాహుల్ ప్రశ్నించారు.

'సెకీ ఒప్పందాల్లో జరిగిన అవినీతిని బయట పెట్టాలి. అదానీని అరెస్ట్ చేసి విచారిస్తే సెకీ అక్రమాలు వెలుగులోకి వస్తాయి. అదానీని అరెస్ట్ చేసే ధైర్యం ప్రధాని మోదీకి ఉందా? అదానీ అరెస్ట్ అయితే ప్రధాని మోదీ అక్రమాలు బయటపడతాయి. అందుకే అదానీని మోదీ అరెస్ట్ చేయరు. అదానీ, మోదీ ఇద్దరూ ఒక్కటే. అదానీ విద్యుత్ ఒప్పందాల్లో అవినీతిపై అమెరికా కోర్టులో కేసులు కూడా పెట్టారు. దేశంలో మాత్రం ఏ కేసు లేవు అని' రాహుల్ విమర్శించారు.

'గౌతమ్ అదానీ వెనక ప్రధాని మోదీ ఉన్నారు. అదానీని మోదీ కాపాడుతున్నారు. చిన్న చిన్న దొంగతనాలు చేసే వారిపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతారు. అదానీపై కేసులు పెట్టరు. అదానీ విద్యుత్ అవినీతిపై పార్లమెంటు సమావేశాల్లో లేవనెత్తుతాం. అదానీని అరెస్ట్ చేయరు. ప్రధాని మోదీ ఆయనకు రక్షణ కవచంగా నిలబడ్డారు అని' రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు.

## అఖండ భారతంలో అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా?

- ఎమ్మెల్సీ కవిత ట్వీట్

హైదరాబాద్,(నమస్తే ఉదయం):

అదానీ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్ చేశారు. బీజేపీ, ప్రధాని మోదీపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. అదానీ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్ చేశారు. బీజేపీ, ప్రధాని మోదీపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. జైలు నుంచి విడుదల అయ్యాక తొలిసారి కవిత రాజకీయ వ్యాఖ్యలు చేశారు. ఎన్నిసార్లు ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా..? అని కవిత ప్రశ్నించారు.

అఖండ భారతంలో అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా అని ప్రశ్నించారు కవిత. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ. ఆధారాలు ఉన్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా అని కవిత ప్రధానిని ప్రశ్నించారు. ఎన్ని సార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా అని సూటిగా ప్రశ్నించారు.

## చట్టాలకు లోబడే నడుచుకుంటాం..

### ఆరోపణలపై అదానీ గ్రూప్ వివరణ

న్యూఢిల్లీ,నవంబర్21(నమస్తే ఉదయం):

సోలార్ పవర్ కాంట్రాక్టుల కోసం లంచం ఇవ్వడానికి చూశారంటూ అమెరికా ప్రాసిక్యూటర్స్ చేసిన ఆరోపణలను అదానీ గ్రూప్స్ ఖండించింది. ఆ ఆరోపణలు నిరాధారమైనవని అభిప్రాయపడింది. చట్టాలకు లోబడే తమ గ్రూప్ నడుచుకుంటుందని పేర్కొంది. న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించింది. దోషులుగా

మిగతా.. 2లో

## వచ్చే నెల తొలివారంలో టీజీపీఎస్సీ గ్రూప్ 2 హాల్ టికెట్లు విడుదల

హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):

తెలంగాణ గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే టీజీపీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 15, 16 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 4 పేపర్లకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

మిగతా.. 2లో

## మాజీ సర్పంచ్‌లకు గుడ్ న్యూస్!

### పెండింగ్ బిల్లుల చెల్లింపుకు ప్రభుతం సుముఖం!!

హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సర్పంచ్‌లకు గుడ్ న్యూస్ చెప్పనున్నారు. త్వరలోనే పంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ పంచాయతీలకు సంబంధించి 750 కోట్ల రూపాయల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసింది.

మిగతా.. 2లో




## హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకువెళతాం

### మూసీ పునరుజ్జీవం నుంచి వెనక్కి తగ్గం

### ఎన్ని శక్తులు అడ్డుపడినా పూర్తి చేస్తాం

### ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):

మూసీ నదిని ప్రక్షాళనచేసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని, ఎన్ని శక్తులు అడ్డుపడినా పక్రియ పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

'నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి..నదులను కబళిస్తే.. మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజా ఆరోగ్యం పటిష్ఠ ఆర్థికం పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ, శాపంగా మిగిలి పోకూడదు.

మిగతా.. 2లో

## మహిళా సాధికారతకు పెద్దపీట

- సిద్ధమవుతున్న 22 మహిళా శక్తి భవనాలు
- శిల్పారామంలో 106 స్టాళ్ళతో ఇందిరా మహిళా శక్తి బజార్
- తొలివిడతలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు
- మొదటి దశలో 150 బస్సుల కొనుగోలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):

రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో భాగంగా మహిళా స్వయం సహాయక బృందాలచే బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ ల ఏర్పాటు, శిల్పా రామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ల ఏర్పాటు పనులు ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కార్య క్రమం అమలుపై నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, 22 ఇందిరా మహిళ శక్తి భవనాల నిర్మాణం పనులు మొదలుపెట్టి,

మిగతా.. 2లో

## మూసీలో అదానీ వాటా ఎంతో?

- అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయండి
- తెలంగాణా ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ హైకమాండ్ వాటా ఎంత?
- అదానితో కాంగ్రెస్ - బీజేపీ అనుబంధం దేశానికి అవమానం..అరిష్టం
- అదానీ తాజా కుంభకోణంపై సీఎం రేవంత్‌కు ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):

అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు. అదానితో కాంగ్రెస్ - బీజేపీ అనుబంధం.. దేశానికి అవమానం.. అరిష్టం.

రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిందో, మూసీ లో అదానీ వాటా ఎంతో! ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా.. తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు! తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయండి. మీరు అదానీ తో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలి. తెలంగాణా ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ భడే భాయ్ వాటాఎంత? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత?

## లంచాలకు మరిగితే అంతే సంగతులు

- పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది
- పోలీసులు తాగుడుకు దూరంగా ఉండండి
- ఎప్పుడూ ఫిట్‌గా ఉండేలా చూసుకోవాలి
- పోలీసులకు కీలక సూచనలు చేసిన కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):

పోలీసులు తాగుడుకు దూరంగా ఉండాలని సీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. యువ పోలీసులు ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉండాలని.. దేనికి ఏ వ్యసనానికి కూడా

లొంగకూడదని.. బానిస కాకూడదని తెలిపారు. 'నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్‌లో 75 కేజీల మధ్యలో ఉన్నాను. నేను చాలా ఫిట్‌గా

మిగతా.. 2లో

## డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు

### పలు బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం కసరత్తు

హైదరాబాద్,(నమస్తే ఉదయం):

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వం వెల్లడించింది సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి

మిగతా.. 2లో

## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..

### స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు

హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి బేగంపేట విమానాశ్రయానికి వస్తున్న సందర్భంగా

మిగతా.. 2లో

## వచ్చే నెల తొలివారంలో టీజీపీఎస్సీ గ్రూప్ 2 హాల్ టికెట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 1, 3 పరీక్షలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్ 2, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను డిసెంబర్ 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది. ఈ మేరకు తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 783 గ్రూప్ 2 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే.మొత్తం 18 విభాగాల్లో 783 పోస్టులను టీజీపీఎస్సీ భర్తీకి గత ఏడాది గ్రూప్ 2 ఉద్యోగ ప్రకటన జారీచేసిన సంగతి తెలిసిందే. 2023 జనవరి 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,51,943 మంది అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే మూడు సార్లు వివిధ కారణాలతో గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడింది. మరోవైపు గ్రూప్ 2 పోస్టుల సంఖ్య పెంచాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు స్పందించని రేవంత్ సర్కార్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటుంది. గత డీఎస్సీలో కూడా ప్రభుత్వం ఇలాంటి వైఖరే అనుసరించింది. డీఎస్సీ పరీక్షలను నెల రోజుల పాటు వాయిదా వేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు నిరసనలు చేపట్టినా.. కనీసం పట్టించుకోకుండా మొండి వైఖరితో పరీక్షలు నిర్వహించింది. కనీసం గ్రూప్ 2 పోస్టుల పెంపు విషయంలో అయినా సర్కార్ కరుణిస్తుందేమోనని నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వ తీరు ఇందుకు భిన్నంగా ఉండటం గమనార్హం. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే..

## మాజీ సర్పంచ్‌లకు గుడ్ న్యూస్ !

(మొదటి పేజీ తరువాయి)

అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయి పెట్టిన 1,200 కోట్లకు పైగా పంచాయతీ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. ఇటీవల కాలంలో బిల్లులు చెల్లించాలంటూ సర్పంచ్ లు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. పలు చోట్ల ధర్నాలు చేసిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. పంచాయతీలకు పెండింగ్ లో ఉన్న బిల్లులను దశల వారీగా క్లియర్ చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమయింది. నిధులతో జరిగిన పనులపై ఆరా తీసే పనిలో సరకార్ పడింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ లో ఉన్న బిల్లుల వివరాలను ఇవ్వాలని కోరింది. పంచాయతీల వారీగా పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? ఎప్పుడు పూర్తయ్యాయి? వంటి వివరాలను అందించాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లను కోరింది. అయితే ఇప్పటి వరకూ తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో చేపట్టిన పనుల్లో 588 కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని ప్రాథమికంగా తేలింది. పంచాయతీ బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్ లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గరపడుతుండటంతో రేవంత్ ప్రభుత్వం ఈ బిల్లులను క్లియర్ చేయాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ లకు అనుకూలంగా ఉంటుందన్న సంకేతాలను బలంగా పంపేందుకు ఈ బిల్లులను క్లియర్ చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. అదే జరిగితే సర్పంచ్ లు అందరూ హ్యాపీగా ఉంటారని అభిప్రాయం వ్యక్తం అయింది. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగపడుతుందని భావిస్తుంది.

## హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకువెళతాం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ప్రక్షాళన చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం. ఈ తరానికే కాదు.. తరతరాలకు మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం రేవంత్ ఓ పోస్ట్ చేశారు. కాగా.. మూసీ పరీవాహక ప్రాంతం మురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో యాదవులకు అత్యధికంగా సీట్లు ఇస్తామని, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పెంచి నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టానని బీఆర్ఎస్ అంటోందని, ఈ మూసీ ప్రక్షాళన చేయకపోతే తన జన్మ దండగ అని భావోద్వేగానికి లోనయ్యారు. 'రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపట్టి.. రూ.25 వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నామంటున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.?

### డిసెంబర్ 9వ తేదీ నుంచి

## శాసనసభ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ సర్కారు సన్నద్ధం చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టాన్ని ఆమోదించాలని చూస్తోంది. రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది. డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకోనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిసింది. అయితే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వినిపిస్తోంది. కానీ ఆలోపే మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు జరుగుతోందని కూడా సమాచారం అందుతోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పెన్షన్, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని పెంచేందుకు రేవంత్ సర్కారు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎలక్షన్స్‌కు ముందు పెన్షన్, రైతు భరోసాను పెంచితే ప్రభుత్వానికి మంచి పేరుతో పాటు పార్టీకి మైలేజీ వస్తుందని భావిస్తున్నారట. అసెంబ్లీ సమావేశాలు, పంచాయతీ ఎన్నికల మీద ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్.. అందుకు అనుగుణంగా కులగణను చేపట్టారు. మరోవైపు కొండపోచమ్మ సాగర్ దగ్గరలోని మాజీ మంత్రి హరీష్ రావు ఫామ్‌హౌస్‌పై విచారణ జరిపించాలని నిర్ణయించారు. గత పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం చేసిన అవినీతికి సంబంధించి అసెంబ్లీలో వాడీవేడీ చర్చకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ ఉద్యమంలో దీక్షా దివస్ కీలకం

### 29న రాష్ట్రవ్యాప్తంగా దీక్షాదివస్ నిర్వహణ : కెటిఆర్

**హైదరాబాద్,నవంబర్21(నమస్తే ఉదయం):** తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్ష దివాస్ నిలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్ష దివాస్‌ను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో జరిగే దీక్షా దివాస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొననున్నారు. 2009, నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలి దశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదలు వేసిందని కేటీఆర్ తెలిపారు.

# లంచాలకు మరిగితే అంతే సంగతులు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాను. 30 ఏళ్ల క్రితం నా ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో వేసుకున్న పోలీస్ డ్రెస్ ఇప్పుడు కూడా వేసుకోగలను. మీరు శిక్షణ పొందిన పేట్లబురుజు ఆర్మ్ రిజర్వ్ ఇన్చార్జ్ డీసీపీ దక్షిణామూర్తిని చూడండి ఎంత ఫిట్‌గా ఉన్నారో. ఫిట్‌గా ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోండి అని సూచించారు.. పోలీసుల జీతాల విషయంలో ప్రభుత్వం ఎక్కువగా పెంచదు. పోలీసులు అవినీతికి పాల్పడ కూడదు. ఐపీఎస్ లాంటి ఉద్యోగంలో కూడా జీతాలు అంతంత మాత్రమే. పోలీస్ శాఖలో మెల్లమెల్లగా జీతాలు పెరుగుతూనే ఉంటాయి. పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది. ఒక పరిస్థితిలో నేను కూడా రాజీనామా చేసి వెళ్ళలనుకున్నా. శిక్షణ తీసుకున్నవారు మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి' అంటూ సీపీ ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8,047 మంది పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ పొందారని.. ఇందులో 4,100 సివిల్, 3,685 మంది ఏఆర్ 2,028 కమ్యూనికేషన్స్, 18 మంది పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఉన్నారని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో నుంచి హైదరాబాద్ పోలీస్ శాఖకు 1,128 మందిని ట్రైనింగ్ కోసం కేటాయించినట్లు చెప్పారు. ఇప్పుడు 747 మంది దీక్షత్ పాసింగ్ అవుట్ పరేడ్ చేశారన్నారు. 3,081 మంది మహిళల కానిస్టేబుల్స్ పోలీస్ శిక్షణ పొందారన్నారు. 1992లో తాను ఐపీఎస్ శిక్షణ పొందాను పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. అప్పుడు 80 మంది ట్రైనీ ఐపీఎస్‌లు పాల్గొన్నాం. వర్షం పడుతున్నా పరేడ్ పూర్తి చేశాం' అంటూ ఆనాటి విషయాలను గుర్తుచేశారు సీపీ. శిక్షణ పొంది పోలీస్ శాఖలో 35 ఏళ్లు గడపబోతున్నారని... శిక్షణ పొందిన వారు అకుంఠిత దీక్షతో పని చేయాలని సూచించారు. పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలన్నారు. పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడడంలో కర్తవ్యం నెరవేర్చాలని స్పష్టం చేశారు. పోలీస్ డ్యూటీ అంటే ఒత్తిడితో కూడుకున్నదని ఆయన తెలిపారు. అలాగే పోలీసులకు సీపీ ముఖ్య సూచన చేశారు. కాగా.. తెలంగాణా పోలీస్ అకాడమీలో కానిస్టేబుల్స్ నాలుగవ పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ జితేందర్, పోలీసులు ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఆర్, సివిల్, ఎస్ఏఆర్‌సీపీఎల్, ఐటీ, సీఏఎన్‌పీటీఓ విభాగాలకు చెందిన 8,047 మంది స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ విజయవంతమైంది. ఫిబ్రవరి21, 2024లో స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్స్ శిక్షణ మొదలైంది. రాష్ట్రంలో మొత్తం 19 ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ జరిగింది. కానిస్టేబుల్ శిక్షణ పొందిన వారిలో 5709 పురుషులు, 2338 మహిళ అభ్యర్థులు ఉన్నారు. ట్రైనీ కానిస్టేబుల్స్‌కు సమగ్రంగా అన్ని అంశాలపై శిక్షణ పూర్తి అయ్యింది. సివిల్, క్రిమినల్, సైబర్ కేసులు, ఎన్‌డీపీఎస్ యాక్ట్, క్రైమ్, సెల్ఫ్ డిఫెన్స్ ఇలా చాలా అంశాలపై ట్రైనింగ్ జరిగింది. కానిస్టేబుల్స్‌లో గ్రాడ్యుయేషన్ 5470 , పోస్ట్ గ్రాడ్యుయేషన్ 1361 చదివిన వారు ఉన్నారు. ఇందులో టెక్నికల్1755, నాన్ టెక్నికల్ 5505, లా పూర్తి చేసుకున్న వారు 15 మంది ఉన్నారు. నేడు పాసింగ్ ఔట్ పరేడ్ తరువాత తెలంగాణ పౌరుల సేవలో 8,047 మంది కానిస్టేబుల్స్ పాల్గొననున్నారు.

## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..

(మొదటి పేజీ తరువాయి)

ముందుగానే.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి సీతక్క పలువురు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి రాగానే.. గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి పుష్పగుచ్చాన్ని అందించి, పలువురు అధికారులు కూడా స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి కాన్వాయ్ బయలుదేరి వెళ్ళింది. రాష్ట్రపతి కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో, పోలీసులు అడుగడుగునా నిఘా ఉంచారు. రెండు రోజుల పాటు రాష్ట్రపతి పర్యటన సాగుతున్న సందర్భంగా, హైదరాబాద్ పోలీసులు పలు ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.శుక్రవారం మాదాపూర్ శిల్పకళా వేదికగా నిర్వహించే లోక్ మంతన్ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సుమారు 120 దేశాలకు చెందిన 1500 మంది ప్రతినిధులు పాల్గొంటారని సమాచారం. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పర్యటన సందర్భంగా పోలీసులు హైదరాబాద్ లో భారీ బందోబస్తు చేపట్టారు.

## మహిళా సాధికారతకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

8 మాసాలలో పూర్తి చేయాలనీ ఆదేశించారు.రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికై శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దాదాపు 106 షాప్ లతో ఏర్పాటు చేస్తున్న ఈ బాజార్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, డిసెంబర్ మొదటి వారంలోగా ఈ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ ఇందిరా మహిళా శక్తి బజార్లో నిత్యం వివిధ సాంస్కృతిక సామాజిక కార్యక్రమాలు చేయటానకి మహిళలకు ఆర్థిక చేయూతకై నగరంలోని ఐ.టి సంస్థలు, ఇతర ప్రముఖ వాణిజ్య, వ్యాపార సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో అద్భుతంగా పొదుపు సంఘాలను నిర్వహిస్తూ, అధిక మొత్తంలో డబ్బును పొదుపు చేసిన మహిళా సంఘాలచే బస్సులను కొనుగోలు చేయించి వాటిని టీ.ఎస్.ఆర్.టీ.సి ద్వారా నిర్వహించేందుకు తగు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ సంఘాల ద్వారా మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించాలని, దీనిలో భాగంగా మొదటి దశలో 150 బస్సుల కొనుగోలును వెంటనే చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. ఈ బస్సుల నిర్వహణ భాద్యతలను ఆర్టీసీ చేపడుతుందని అన్నారు. వీటితో పాటు, మహిళా సంఘాల ద్వారా 4000 మేఘావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మొదటి దశలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తున్నామని వివరించారు. ఈ ప్లాంట్లను నీటిపారుదల శాఖ, దేవాదాయ, ఆటవీ శాఖలో నిరుపయోగంగా ఉన్న కాళీ భూములను లీజ్ పద్ధతిన సేకరించి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలను కూడా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు అనంతరం వీటి నిర్వహణా భాద్యతలను తెలంగాణ రెడ్కో, విద్యుత్ డిస్కం లు చేపడుతాయని స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుల ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల మహిళలకు పెద్ద మొత్తం లో ఆదాయం లభిస్తుందని సి.ఎస్ తెలిపారు.

రవాణా, రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి వికాస్ రాజ్, PCCF ఆర్.యం. డోబ్రియల్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి సవీన్‌మిట్టల్, ఎండో మెంట్స్ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యా వరణ, అటవీ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయత్ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, సెర్ప్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

# అదానీ లంచావతారం..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఒప్పందంపై నాటి ఇంధనశాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్, డిస్కమ్‌ల తరపున సీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్ధన్ రెడ్డి, ఇతర అధికారులు సంతకాలు చేశారు. 2.3 గిగావాట్ల విద్యుత్ కొనుగోలుకు 25 ఏళ్ల పాటు యూనిట్‌కు 2.49 రూపాయల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. అయితే అదే సమయంలో గుజరాత్ రాష్ట్రానికి యూనిట్‌ను రూపాయి 99పైసలకే సెకీ ద్వారా అదానీ గ్రీన్ ఎనర్జీ విక్రయించింది.

అయితే ఇవన్నీ తెరముందు జరిగిన అధికారిక ఒప్పందాలు. ఒప్పందాలు కుదరడానికి తెరవెనక పెద్ద భాగోతమే జరిగిందని అమెరికా కోర్టులో నమోదైన కేసు పత్రాల్లో తెలుస్తోంది. అధిక ధరల కారణంగా సెకీ నుంచి విద్యుత్ కొనుగోలుకు ఏ ప్రభుత్వ సంస్థా ముందుకు రాకపోవడంతో అదానీ గ్రూపు ప్రతినిధులు లంచాలు ఎరవేసినట్లు అమెరికన్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ఇండియన్ ఎనర్జీ కంపెనీ అంటే అదానీ గ్రీన్ఎనర్జీ కంపెనీ, దానికి అనుబంధంగా ఉన్న మారిషస్‌కు చెందిన పునరుత్పాదక సంస్థ అమెరికా ఇష్యూయర్ ప్రతినిధులు ఈ అవినీతికి తెరలేపినట్లు వెల్లడించారు.

గౌతమ్ అదానీ, అదానీ మేనల్లుడు సాగర్ అదానీ, అదానీ బోర్డు సభ్యుడు వినీత్ జైన్, ఇతరులు అప్పటి ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇవ్వడం ద్వారా ఒప్పందాలకు మార్గం సుగమం చేశారని అమెరికన్ ప్రాసిక్యూటర్ తెలిపారు. భారత ప్రభుత్వ అధికారులకు దాదాపు 2029 కోట్ల లంచాలు ఇవ్వాలని నిర్ణయించారు. అందులో 7 గిగా వాట్ల విద్యుత్ కొనేందుకు ఒప్పందం చేసుకున్నందుకు 2019 మే నుంచి 2024 జూన్ వరకు అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధినేత జగన్‌కే 1750 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఒప్పందంలో భాగంగా ఛత్తీస్‌గడ్, తమిళనాడు, ఒడిశా, జమ్మూకశ్మీర్‌కు 650 మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరా చేస్తామని యూఎస్ ఇష్యూయర్ అంగీకరించింది. ఆంధ్రప్రదేశ్‌కు 2.3 గిగావాట్ల విద్యుత్ సరఫరా చేస్తామని సెకీతో పీపీఏ కుదుర్చుకుంది. రాష్ట్రాలు కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందంలో మెగావాట్‌ను బట్టి లంచం ధరను నిర్ణయించినట్లు తెలిపారు.

ఈ 2029 కోట్ల రూపాయల లంచాల్లోని యూఎస్ ఇష్యూయర్ వాటా కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్ద జగన్‌కు 583 కోట్లుగా, మిగిలిన రాష్ట్రాలకు 55 కోట్లుగా దిల్లీలో గౌతమ్ అదానీ సమక్షంలో నిర్ణయించారని అమెరికన్ ప్రాసిక్యూటర్ వివరించారు. తర్వాత గౌతమ్ అదానీ సూచన మేరకు యూఎస్ ఇష్యూయర్ 2.3 గిగావాట్ల పీపీఏను ఉపసంహరించుకుంది. ఈ మేరకు 2022 డిసెంబరు 7న సెకీకి లేఖ రాసింది. తర్వాత పీపీఏను అదానీ గ్రీన్‌కు కేటాయించేలా సెకీలో చక్రం తిప్పినట్లు అమెరికన్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ఈ అవినీతి వ్యవహారాన్ని దాచి ఒప్పందాలను చూపించి మొత్తం 12 గిగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూపు అమెరికా బ్యాంకులు, పెట్టుబడిదారుల నుంచి బిలియన్ డాలర్లను సమీకరించినట్లు అమెరికన్ ప్రాసిక్యూటర్ వివరించారు.

2020 నుంచి 2024 మధ్య అదానీ గ్రూపు 2 బిలియన్ డాలర్ల నిధులను అమెరికన్ సంస్థలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి సేకరించినట్లు పేర్కొన్నారు. 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాలు సాధించేలానేది ఈ మొత్తం అవినీతి వ్యవహారంవెనక అసలు ఉద్దేశమని అమెరికా అటార్నీ బ్రియాన్ పీస్ చెప్పారు. ఈ వ్యవహారం ఒప్పందాలు, దానికి సంబంధించిన పత్రాలను అదానీ గ్రీన్ బోర్డు సభ్యుడైన వినీత్ జైన్ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు.

అదే సమచారం అదానీ మేనల్లుడు సాగర్‌కు చేరవేశారు. 2023 మార్చి 17న ఎఫ్బీఐ ప్రత్యేక ఏజెంట్లు అమెరికాలో ఉన్న సాగర్ అదానీ ఇంటిలో వారంట్ తీసుకుని సోదాలు చేశారు. ఆ సోదాల్లో ఎలక్ట్రానిక్ డివైస్‌లను జప్తు చేశారు. ఆ డివైస్‌లను విశ్లేషించగా లంచాలు అంశం వెలుగులోకి వచ్చింది. సెల్‌ఫోన్ సందేశాల్లో గౌతమ్ అదానీని న్యూమరో ఉనో, ద బిగ్ మేన్ అంటూ మారుపేర్లతో సంబోధించినట్లు తేలింది.

### దుర్గానగర్‌లో రూ.10 కోట్లతో చేపడుతున్న బాక్స్ టైప్ డ్రెయిన్, సీసీ రోడ్డు,

## రిటర్నింగ్ వాల్ లను పరిశీలించిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

**రాజేంద్రనగర్, నవంబరు 21(నమస్తే ఉదయం):** దుర్గానగర్ చౌరస్తా నుంచి దుర్గానగర్ వీధుల గూండ పల్లె చెరువు వరకు రూ. 10 కోట్లతో చేపడుతున్న జాక్స్ టైప్ డ్రెయిన్, సిసీ రోడ్డు, రిటర్నింగ్ వాల్ పనులను గురువారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ పనులు ఇప్పటికీ 95శాతం అయిపోయాయి స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ జీహెచ్ఎంసీ ప్రాజెకు డీఈ సలావుద్దిన్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, ఈఈ నరేందర్ గౌడ్, ఏఈ నర్సింహ్మ మూర్తి, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రేణుక, మాజీ కార్పొరేటర్ టి. ప్రేందాస్ గౌడ్ లతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా దుర్గానగర్ బస్తీ ప్రజలు ఇంకా పలు చోట్ల బాక్స్ టైప్ డ్రెయిన్ కు కనెక్షన్ కలపాల్సిన చోటును అధికారులకు ఎమ్మెల్యే సమక్షంలో చూపించారు. దుర్గానగర్ చౌరస్తాతో పాటు బస్తీ లో పలు ప్రాంతాలలో బాక్స్ టైప్ డ్రెయిన్ కు కనెక్షన్ కలపాలని ఆ పనులను కూడా చేయించాలని కోరారు. అప్పటి వరకు కాంట్రాక్టర్ కు బిల్లులు ఇవ్వవద్దని విన్నవించారు. రూ.10కోట్లతో చేపడుతున్న పనులు పూర్తిగా అయిన తర్వాతనే కాంట్రాక్టరుకు బిల్లులు ఇస్తే బాగుంటుం దన్నారు. దుర్గానగర్ బస్తీలో డ్రెయిన్ లీకేజీ లు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, ఎస్టిమేషన్ లో ఉన్న మాదిరిగా అన్ని పనులు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. అన్ని జంక్షన్ల వద్ద డ్రైనేజికి కనెక్షన్లు కలపాలన్నారు. బాక్స్ డ్రెయిన్ పక్కన మట్టి లేదా సిమెంటుతో ఫిల్లింగ్ చేయాలని, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

దుర్గా నగర్‌లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప

## డిసెంబర్ 1న..చలో హైదరాబాద్

### మాలల సింహగర్జన సభకు తరలిరావాలి

### నందిగామ మాల మహానాడు నాయకులు ఏకుల వెంకటయ్య, దార లింగం పిలుపు

**నందిగామ నవంబర్ 21 (నమస్తే ఉదయం):** ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరగకుండా అందరం సంఘటితం కావలసిన అవసరం వచ్చిందని డిసెంబర్1 వ తేదీన హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో మధ్యాహ్నం జరిగే మాలల సింహ గర్జన సభకు భారీ సంఖ్యలోమాలలు తరలిరావాలని నందిగామ మాల మహానాడు నాయకులు ఏ కుల వెంకటయ్య, ధారలింగం లు పిలుపు నిచ్చారు. గురువారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ కాలనీలో నియోజక వర్గం కన్వీనర్ డాక్టర్ బుచ్చన్న ఆధ్వర్యంలోజరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మాలల జనాభా తక్కువగా ఉందని, రాజకీయంగా వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని దుష్ప్రచారం జరుగుతుందన్నారు. దుష్ప్రచారాన్ని అందరం ఖండించాల న్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహేష్, ప్రభయ్య, కో కన్వీనర్లు రామకృష్ణ, జనార్ధన్, అర్జున్ కుమార్, నర్సింలు, రామచంద్రయ్య, మహేష్, యాదయ్య, జంగయ్య, సాయి ప్రేమ్, ప్రభయ్య, ఏకుల జంగయ్య, అంజయ్య, శ్రీకాంత్, రమేష్ తదితరులు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

## హైదర్‌గూడ దుర్గామాతకు ప్రాణప్రతిష్ట

### చండీ యాగం, అన్నదాన కార్యక్రమాలు

**రాజేంద్రనగర్, నవంబరు 21(నమస్తేఉదయం):** హైదర్ గూడ శ్రీ దుర్గామాత దేవాలయం పునర్నిర్మాణం పూర్తయింది. మహబలేశ్వరం లో రూపొందించిన దుర్గామాత విగ్రహానికి వేద బ్రాహ్మణ పం డితుల వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయంలో గురువారం ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భం గా ఆలయ ధర్మకర్త చెట్టిగారి వసంతరావు ఆధ్వర్యంలో గణపతి హెూమం, చండీ యాగం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ్మ, మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి, చెట్టిగారి నరేందర్, ఎన్. మల్లారెడ్డి, వనం సహింహ్మ, సోమారం రాజకుమార్, ఎస్.జయానందరెడ్డి, మ్యాదం ప్రవీన్ కుమార్, సులిగె వెంకటేశ్, సామాజిక కార్యకర్త మ్యాదం. మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంబరాలు నిర్వహించేందుకు అనుమతివ్వాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్21(నమస్తే ఉదయం):** మల్దకల్ మండల కేంద్రంలోగల శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించు రైతు సంబురాలో భాగంగా ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహించేందుకు అనుమతివ్వాలని గురువారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాముడు, అల్వాల రాజశేఖరరెడ్డి, పెదొడ్డి రామకృష్ణ,

గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, కురువ శ్రీనివాసులు, ఆనంద్ ఆనంద్ గౌడ్, జమ్మిచేడు సురేష్, తిమోతి,గుడ్డెందొడ్డి నర్సింహులు, మాజీ సర్పంచ్ జయన్న,రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, నవంబర్ 21(నమస్తే ఉదయం):** వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన గాంధీనగర్, చౌడమ్మ టెంపుల్, ఎమ్ఐ సాగర్ కట్ట కాలనీ, రాజేంద్రనగర్ ప్రధాన రహదారి ప్రభుత్వ కార్యాలయాల లో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు, నార్మ టైపు -1,2 క్వార్టర్స్ మేనేజ్ ప్రధాన రహదారి ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా అనిల్ వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఎంత రాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### హిమాయత్ సాగర్‌లో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో కాళీ మందిర్ విద్యుత్తు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీ నగర్, భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి నగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధం గూడ గృహాలు ప్రాంతాలలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయిరాం విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సాయి హర్షకాలని, సాయిరాం నగర్, సాయిరాం ఎంక్లేవ్, సౌభాగ్యనగర్, ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ బి అమర్ సింగ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# పోలీసులు నిజాయితీగా,న్యాయంగా పనిచేయాలి

## పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలి : సిటీ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్

**హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే ఉదయం):** (21-11-2024) న తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల AR, IT &C మరియు rc PTO-Mechanic SCTPCల (స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్) "దీక్షాంత్ పరేడ్" (పాసింగ్ అవుట్ పరేడ్) హైదరాబాద్ లోని పెట్లబుర్జ్ CAR హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో జరిగింది. ఈ " దీక్షాంత్ పరేడ్" కు ముఖ్య అతిథిగా శ్రీ సివి. ఆనంద్, ఐపిఎస్, కమిషనర్ ఆఫ్ పోలీసు, హైదరాబాద్ సిటీ గారు పాల్గొన్నారు.

తేది:21-02-2024 నుండి SCTPCలు వారి నియామకం తరువాత, వివిధ జిల్లాల కు సంబంధించిన (747) SCTPC లు (9) నెలల బేసిక్ ఇండక్షన్ శిక్షణ కొరకు హైదరాబాద్‌లోని పెట్ల బురుజు సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ , మెట్రో బ్యాక్ లర్నింగ్ సెంటర్ బేగంపేట్ లో (313) గోషామహల్(313)లో శిక్షణ పొందారు.

ఈ (9) నెలల బేసిక్ ఇండక్షన్ కోర్సులో, BNS & BSA, BNSS & SPL & Local Laws.. లా అండ్ ఆర్డర్, క్రైమ్ అండ్ ఇన్వెస్టిగేషన్, ఇంటెలిజెన్స్ & ఇంటర్నల్ సెక్యూరిటీ, పర్సనాలిటీ డెవలప్మెంట్, పోలీస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డాక్యుమెంటేషన్లపై ఇండోర్ తరగతులు నిర్వహించబడ్డాయి.

అవుట్డోర్ సెషన్లలో, క్యాడెట్లకు యోగా, ధ్యానం, శారీరక శిక్షణ, స్క్వాడ్ డ్రిల్, లాఠి డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, పరేడ్ డ్రిల్, ఆయుధ వ్యూహాలు & కాల్పులు, ట్రాఫిక్ డ్రిల్, బేస్ క్యాంప్ & ఫీల్డ్ క్రాఫ్ట్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. అడిషనల్ డీసీపీ (సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్)

శ్రీ మద్దిపాటి శ్రీనివాసరావు సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లలో శిక్షణ పొందినవారి మొత్తం శిక్షణా ప్రక్రియను వివరిస్తూ నివేదికను సమర్పించారు.

ఈ సందర్భంగా సిఎ ఆర్ హెడ్ క్వార్టర్స్ డిప్యూటీ కమిషనర్ రక్షిత కృష్ణ మూర్తి హైదరాబాద్ ట్రైనీలకు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ సివి. ఆనంద్ పరేడును పరిశీలించి, పరేడ్ నుండి సాధారణ వందనం స్వీకరించి, ఇండోర్, అవుట్డోర్, ఆల్ రౌండర్, ఫైరింగ్ ఈవెంట్లలో రాణించిన శిక్షణార్థులకు జ్ఞాపికలు

అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 747 మంది పాసింగ్ అవుట్ పరేడ్ ను విజయవంతంగా చేసిన మీ అందరికి శుభాకాంక్షలు అని అన్నారు. వారి కుటుంబ సభ్యులందరికి శు భాకాంక్షలు తెలిపినారు. తరువాత శిక్షణ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 'పోలీస్ ఉద్యోగం అనేది ఒక పవిత్రమైన ఉద్యోగం అని, పోలీస్ ఏ ఒక్క రోజు పనిచేయకున్న సమాజం నడవదు అని తెలపటం జరిగింది. అటువంటి పోలీసులు నిరంతరం

శిక్షణ పొందిన పోలీసుల నుండి వందనం స్వీకరిస్తున్న సిపి సివి ఆనంద్, దిశాంత్ పరేడ్‌లో వందనం స్వీకరిస్తున్న సిపి

సమాజానికై శ్రమిస్తూ ఉండే ఈ తరుణంలో వారికి కుంటుంబ సభ్యుల సహకారం ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుల్స్ శిక్షణ సమయములో చేసే ప్రతిజ్ఞ సారాంశాన్ని తెలుపుతూ పోలీసు శిక్షణ పొందిన వారు అకుంటిత దీక్షతో పని చేయాలి అని,పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలి అని,పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలి అని ,ప్రజల మాన ప్రాణాలు కాపాడడంలో కర్తవ్యం నెరవేర్చాలి అని తెలిపారు. ఇవి మీ సర్వీసు ముగింపు వరకు వాటికీ కట్టుబడి ఉద్యోగ నిర్వర్తన చేయాలని తెలిపినారు. మీరు అందరు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అంటూ పోలీస్ ఉద్యోగం అనేది ఒక టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది అని దీనికి శ్రామిక సామర్థ్యం, ఓపిక తప్పకుండా అలవరుచుకోవాలని అపుడే మన జీవితం ఎలాంటి అడ్డంకులు లేకుండా సర్వీసు సాఫీగా ముందుకు వెళ్తుంది అని తెలిపారు.

మిమ్మల్ని చూస్తే నా అనుభవాలు గుర్తుకువస్తూన్నాయి అని, 1992 లో నేను ఐపిఎస్ శిక్షణ పొందాను , 80 మందితో మా పాసింగ్ అవుట్ పరేడ్ వర్షంలో జరిగింది అని అన్నారు. నేను పోలీస్ శాఖలో శిక్షణ పొంది 33 ఏళ్లు అవుతున్నాయి అని అన్నారు.

పోలీసు శిక్షణ తీసుకున్నఅభ్యర్థులకు కొన్ని ముఖ్య సూచ నలు కూడా తెలియ జేశారు విధి నిర్వహణలో వత్తిడి వలన పోలీసులు చెడు అలవాట్లు నేర్చుకుంటారు, వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. మీరు ఇప్పుడు ఉన్న ఫిజికల్ ఫిట్ నెస్ ను కాపాడుకుంటూ రాబోయే 30 సంవత్సరాల తరువాత కూడా ఇప్పుడు వేసుకున్న యూనిఫారము ధరించే విధముగా ఉండాలి అని అన్నారు. నేను నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్ లో 75-76 కేజీల మధ్యలో ఉన్నాను .నా ఫిట్ నెస్ కూడా అదేవిధముగా ఉండటానికి చాలా శ్రమిస్తాను అని తెలిపినారు.

మన జీత భత్యాల ననుసరించి మన స్థాయిని బట్టి డబ్బుల విషయములో సర్థుక పోవాలి కాని పోలీసులు ఎలాంటి అవినీతికి పాల్పడకూడదు అని అన్నారు. మా ఐపీఎస్ లాంటి ఉద్యోగంలో కూడా జీతాలు అంతంత మాత్రమే ఉంటవి, జీతాలు మన సర్వీసు పెరిగిన కొద్ది మెల్లమెల్లగా జీతాలు పెరుగుతూనే ఉంటాయి అని తెలిపారు. పోలీసు శిక్షణ తీసుకున్నమీరందరు మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి అని అన్నారు. ప్రస్తుతము టెక్నాలజీ పరంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాదిరి ఎన్నో మార్పులు వస్తున్నాయి, కావున మీరు కూడా కాలానుగుణంగా వస్తున్న కొత్త మార్పులను నేర్చుకుంటూ ఉండాలని కోరినారు. మీరు ఏది చేసినా చాలా జాగ్రత్తగా ఆలోచించి చేయాలి, లేనిచో పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తుంది అని పోలీసు కమిషనర్ సివి ఆనంద్ అన్నారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సి ఏ ఆర్ హెచ్ క్యూ ఆర్ ఎస్ డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షిత కృష్ణమూర్తి, సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్(పేట్ల బురుజు) ప్రిన్సిపాల్ మద్దిపాటి శ్రీనివాసరావు, ఆనంద్, మెట్రో బరాక్ లెర్నింగ్ సెంటర్ గోషామహల్ భాస్కర్, మెట్రో బరాక్ లెర్నింగ్ సెంటర్ (బేగంపేట్), ఇతర అధికారులు, క్యాడేట్స్ తల్లిదండ్రులు , బంధువులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జనరంజక పాలన

### ధూం..ధాంగా సాగిన కళా ప్రదర్శనలు

### ప్రతిబింబించిన తెలంగాణ సంస్కృతి

### ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరించిన కళాకారులు

### - అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 21(నమస్తే ఉదయం):** తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ జనరంజక పాలనను అందిస్తోందని అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ సంబురాలు ఘనంగా జరిగాయి. అట్ట హాసపు ఏర్పాట్లతో ఆహ్లాదకర వాతావరణంలో సాగిన కళాయాత్ర ప్రదర్శనలో బృందం ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటుతూ, ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరింపజేశారు. ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ నరసింహారావు, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల అన్ని శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఎంతో ఆసక్తి తో కళాకారుల ప్రదర్శనలను తిలకించారు.

ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు

చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలోనే ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను అమలు చేసిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలో మహిళలు, ట్రాన్స్ జండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించే వైద్య సేవల పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఈ పథకం కింద అందించే చికిత్సల సంఖ్యను కూడా 1835కి పెంచిందని ఎమ్మెల్యే వివరించారు. ప్రగతి భవన్ ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చి, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు "ప్రజావాణి"కి శ్రీకారం చుట్టి, వారంలో రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. 500 రూపాయలకే వంటగ్యాస్ సిలెండర్ సరఫరా, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగిస్తున్న గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణాలో రైతులకు రూ.31 వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేసి అన్నదాతల పట్ల తన చిత్తశుద్ధిని చాటు కుందని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు సన్న బియ్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందిస్తోందని తెలిపారు. ఏడాది కాలంలోనే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తూ, నిరుద్యోగ యువతలో భరోసా కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించిందని గుర్తు చేశారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్స్, మెస్ చార్జీలను గణనీయంగా పెంచిందని, పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తూ మౌలిక సదుపాయాలు పెంపోంది స్తోందని అన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పరంగా ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ఇంటింటి సమగ్ర సర్వే జరిపిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (LB) నర్సింగ రావు, జెడ్పి సీఈవో కాంతమ్మ, అలంపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, వడ్డేపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ కరుణ సూరి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, పిఎసిఎస్ డైరెక్టర్ సుభాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నానమ్మ గురించి రాస్తా...

**హైదరాబాద్, నవంబర్ 21(నమస్తే ఉదయం):** పన్నెండేళ్ల అమ్మాయి పదహారేళ్ల అమ్మాయి గురించి కథ రాస్తే ఎలా ఉంటుంది?! ఏడవతరగతి చదువుతున్న పన్నెండేళ్ల పట్లోళ్ల అక్షయినీ రెడ్డి రాసిన 'ట్రైల్ ఆఫ్ మిస్‌ఫార్చ్యూన్' పుస్తకం ద్వారా మనకు ఈ విషయాలు తెలుస్తాయి.మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి మనవరాలు అక్షయినీరెడ్డి. "మా నానమ్మ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారో రోజూ చూస్తుంటాను. నానమ్మ, అమ్మ, నాన్న.. మా ఇంట్లోని వ్యక్తులే నాకు స్ఫూర్తి. నానమ్మ లైఫ్ గురించి ఒక బుక్ రాయాలనుకుంటున్నాను...' అంటూ ఎన్నో విషయాలను షేర్ చేసుకుంది."నాకు కథలపైన ఆసక్తి మొదలైందంటే అమ్మ చెప్పిన స్టోరీస్ వల్లే. రోజూ రాత్రి పడుకునే ముందు అమ్మ రకరకాల కథలు చెబుతుంటుంది. తమ్ముణ్ణి, నన్ను బయటకు తీసుకెళ్లినప్పుడైనా, కాస్త టైమ్ దొరికినా ఏదో చిట్టి కథ ఉంటుంది. సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు కథలు చెప్పి, వాటిని షార్ట్ ఫార్మ్‌లో రాసి చూపించమనేది. తర్వాత్తర్వాత పుస్తకాల్లోని కథలు చదివినా, వాటిని ఒక చిన్న పేరాలో రాసి చూపించేదాన్ని..ఈ అలవాటు నాకు పుస్తకాలంటే ఇష్టం పెరిగేలా చేసింది. ఇప్పుడు నా కోసం ఇంట్లో ఓ లైబ్రరీయే ఏర్పాటు చేశారు. ఎక్కువ భాగం ఇంగ్లిష్‌వే ఉంటాయి. ఫారినర్స్ రాసినవి, సుధామూర్తి రచనలు బాగా చదువుతాను. ఒక బుక్ చదివాక బాగా నచ్చితే ఆ బుక్ నుంచి మరొక స్టోరీ రాస్తాను. 'ట్రైల్ ఆఫ్ మిస్ ఫార్చ్యూన్' పుస్తకం అలా రాసిందే. నానమ్మ, నాన్న, అమ్మ, స్కూల్లో టీచర్స్, ఫ్రెండ్స్.. చాలా మెచ్చుకున్నారు.

### బలమైన వ్యక్తిత్వం..

'ట్రైల్ ఆఫ్ మిస్ ఫార్చ్యూన్' బుక్ లో పదహారేళ్ల అమ్మాయి పేరు ఆటమ్. ఆమె భావోద్వేగాలు ఈ పుస్తకం నిండా ఉంటాయి. ఒక చిన్న వెకేషన్ కోసం తల్లిదండ్రులను ఒప్పించి మెక్సికోకు బయల్దేరుతుంది. అనుకోని సంఘటనలో తల్లి మరణిస్తుంది. తమ కుటుంబం నుంచి దూరమైన ఆంటోనియోను కలుసుకుంటుంది. క్షేమకరం కాని ఆ ప్రాంతంలో ఉండలేక మెక్సికో నుంచి వాళ్లు లండన్‌కు చేరుకుంటారు. అక్కడ జేమ్సన్ అనే వ్యక్తిని కలుస్తారు.

జేమ్సన్ కుటుంబంతో ఉండటమూ క్షేమకరం కాదని అర్థమై తండ్రి, ఆంటోనియోలతో కలిసి జర్మనీకి వెళ్లిపోతుంది. జీవితమెప్పుడూ సంతోషంగా ఉండాలనుకునే ఆటమ్ ప్రతినిత్యం సమస్యలతో చేసే ప్రయాణం గురించి ఈ కథ వివరిస్తుంది. ఆ అమ్మాయి స్నేహాలను ఎలా డెవలప్ చేసుకుంటుంది, ఫ్యామిలీని ఎలా చూసుకుంటుంది, ఒకమ్మాయి ఎంత స్ట్రాంగ్‌గా ఉండాలి అనే విషయాలు నేర్పిస్తుంది. ఇంకో విషయం ఏంటంటే హ్యాపీ ఎండింగ్ తప్పక దొరుకుతుంది అనే హెూప్‌ని ఇస్తుంది.

నా ఫ్రెండ్స్ టైటిల్ విషయంలో,కవర్ పేజీ విషయంలో సాయం చేశారు.ఈ బుక్ కోసం ఏడాది పాటు వర్క్ చేశాను. నిజానికి 16 ఏళ్ల అమ్మాయి ఎలా ఆలోచిస్తుంది అనే విషయా లను గురించి అంతగా మ్యాచ్ చేయలేకపోవచ్చు..నా క్లోజ్ ఫ్రెండ్స్ ఇద్దరూ బుక్స్ బాగా చదువుతారు. వారికి ఈ పుస్తకంలో స్నేహపూర్వక స్వభావం,స్ట్రాంగ్ విల్‌పవర్,వ్యక్తిత్వం బాగా నచ్చాయి. నా ఫ్రెండ్స్‌కు నేను రాసిన స్టోరీ నచ్చింది. నా ఫ్రెండ్స్ ఈ బుక్ కొని చాలా సపోర్ట్ చేశారు.స్కూల్లో అందరూ నన్ను అభినందించారు. కొందరు మంచి విమర్శలు కూడా చేశారు.

### ఎంతో నేర్చుకోవాలి..

రచనలు చేయడంలో చాలా నేర్చుకోవాల్సి ఉందని నాకు ఈ పుస్తకం ద్వారా తెలిసి వచ్చింది. వచ్చిన విమర్శల నుంచి కూడా నేర్చుకుంటున్నాను.స్టోరీలో ఒక పాత్రను ఎలా ముందుకు తీసుకెళ్లాలి,ఆ క్యారెక్టర్‌ని ఎలా డెవలప్ చేయాలి, స్టోరీ ఎలా రాయాలి..వంటివి నేర్చుకోవాలి.ఇదంతా తెలుసుకుంటూనే నా రచనల్లో వాటిని ఇంక్లూడ్ చేస్తూ వెళ్లాలని ఉంది.ముఖ్యంగా మా

నానమ్మపై రచించిన పుస్తకాన్ని చూపిస్తున్న అక్షయనీ రెడ్డి, నానమ్మ సబితా ఇంద్రారెడ్డితో అక్షయ్‌ని రెడ్డి

నానమ్మ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారో చూస్తుంటాను.

### నానమ్మ గురించి ఒక బుక్..

రాయాలనుకుంటున్నాను.అందుకు,నేను ఇంకా చాలా నేర్చుకోవాలి. మంచి రైటర్‌గా,బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకుంటూనే లాయర్‌ని అవ్వాలనే లక్ష్యంతో చదువుకుంటు న్నాను. లాయర్‌గా న్యాయం కోసం పోరాటం చేస్తూనే,నా రచనల ద్వారా కొంతమందినైనా ప్రభావితం చేయాలనేది నా ముందున్న లక్ష్యం" అంటూ తెలిపింది ఈ బాల రచయిత్రి.

### టైమ్ క్రియేషన్..

ఈ బుక్ రిలీజ్ అయ్యాక మా ఫ్రెండ్స్‌తో సహా కొంతమంది నీకు టైమ్ ఎలా సరిపోతుంది అని అడిగారు. నేను టైమ్‌ను క్రియేట్ చేసుకున్నాను. రోజులో ఒక గంటసేపు ఈ బుక్ కోసం కేటాయించుకున్నాను. మొత్తం ఇరవై ఐదు వేల పదాలు. నేనే స్వయంగా టైప్ చేసి, ఎడిటింగ్ చేసుకుంటూ, తిరిగి మార్పులు చేసుకుంటూ రాశాను. దీనిని బుక్‌గా తీసుకురావడానికి అమ్మవాళ్లకు చెప్పకుండానే నలుగురు పబ్లిషర్స్‌తో మాట్లాడాను. వాళ్లు ఆశ్చర్యపోయారు. పబ్లిషర్స్ అమ్మ వాళ్లను అప్రోచ్ అవడంతో... ఈ పని ఈజీ అయ్యింది.

# 'సంక్రాంతికి వస్తున్నాం'

## నా కెరీర్‌లో బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్: వెంకటేష్

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ మూడో సారి 'సంక్రాంతికి వస్తున్నాయ్' కోసం మళ్లీ చేతులు కలిపారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలకు భిన్నంగా క్రైమ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ట్రైయాంగిల్ స్టోరీ సంక్రాంతికి వస్తోంది. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాతలు ముందుగా ప్రకటించినట్లుగా, సంక్రాంతికి వస్తున్నాం సంక్రాంతికి ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. నిర్మాతలు ఈరోజు విడుదల తేదీని అనౌన్స్ చేస్తారు. ఈ సినిమా 2025 సంక్రాంతికి జనవరి 14న విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో వెంకటేష్ లుంగీ, నల్ల చొక్కా ధరించి అద్భుతమైన మాస్ లుక్‌లో కనిపించారు. రగ్గడ్ గడ్డంతో, తుపాకీని పట్టుకుని స్ట్రాంగ్ ప్రజెన్స్ తో ఆకట్టుకున్నారు. బ్యాక్‌డ్రాప్ నిర్మాణంలో ఉన్న భవనం కనిపిస్తోంది. హీరో వెంకటేష్ మాట్లాడుతూ.. 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్ అదే. నిజంగానే సంక్రాంతి వస్తున్నాం.(నవ్వుతూ) ఈ సినిమాని మొదలు పెట్టినప్పుడే సంక్రాంతికి రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యాం. సంక్రాంతికి ఒక మంచి ఎంటర్‌టైనర్ ఇవ్వాలనే ఉద్దేశంతో సినిమాని అద్భుతంగా ఫినిష్ చేసి ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తున్నాం. ప్రేక్షకులకి, ఫ్యాన్స్‌కి, ఫ్యామి లీస్‌కి అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. రామ్ చరణ్ గేమ్ చేంజర్, బాలయ్య డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం సినిమా లన్నీ అద్భుతంగా ఆడాలి. అన్ని సినిమాలు ఆడితేనే ఇండస్ట్రీ బావుంటుంది. అనిల్ తో వర్క్ చేయడం చాలా కంఫర్టబుల్గా ఉంటుంది.

ఈ కథని చాలా బాగా రాశారు. అద్భు తంగా తీశారు. సినిమా ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. ఇది నా కెరియర్లో బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సినిమాల్లో పని చేసిన యాక్టర్స్, టెక్నిషయన్స్ అందరికీ థాంక్స్. ఈ సినిమా సంక్రాంతికి వండర్ఫుల్ ఫిల్మ్ కాబోతుంది. డెఫినెట్ గా సినిమాని అందరూ ఎంజాయ్ చేస్తారు' అన్నారు.

# 'పుష్ప-2' కిస్సిక్ సాంగ్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఇండియన్ బిగ్గెస్ట్ ఫిలిం 'పుష్ప-2' ది రూల్.. చిత్రం ఇప్పుడు ఇండియాలో హాట్‌టాపిక్.. సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇండియాస్ ఫేమస్ ప్రొడ్యూసర్స్ నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్‌లు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రం గురించి ఏ చిన్న అప్‌డేట్ అయినా ప్రేక్షకుల్లో, ఐకాన్‌స్టార్ అభిమానుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపుతుంది. ఇటీవల బీహార్‌లోని పాట్నాలో జరిగిన బిగ్గెస్ట్ ట్రైలర్ ఈవెంట్ ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికి తెలిసిందే. కనివిని ఎరుగని జనసంద్రంతో.. ఉప్పొంగిన జనవాహిని సమక్షంలో.. దాదాపు మూడు లక్షల వరకు హాజరైన అభిమానుల సమక్షలంలో ఇండియన్ బిగ్గెస్ట్ ఫిలిం 'పుష్ప-2' దిరూల్ ట్రైలర్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ ఈవెంట్,బిగ్గెస్ట్ మాసివ్ ట్రైలర్ గురించి ఇండియా మొత్తం మాట్లాడుకుంటున్నారు. ట్రైలర్ తరువాత సినిమాపై క్రేజ్.. అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నట విశ్వరూపం డిసెంబరు 5న ప్రపంచమంతా చూడబోతుంది.



బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్ టేకింగ్... కల్డ్ మాస్ మేకింగ్ గురించి మాట్లాడు కోబోతున్నారు. ఇక ఈ చిత్రంలో అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రత్యేక పాట అప్‌డేట్ వచ్చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలపై చిత్రీకరించిన ఈ పాటను ఈ నెల 24న చెన్నయ్‌లో జరగనున్న గ్రాండ్ ఈవెంట్‌లో ఈ కిస్సిక్ సాంగ్‌ను ఏడు గంటల రెండు నిమిషాలకు విడుదల చెయ్యబోతున్నారు. ఒకవైపు ఐకాన్ స్టార్ డ్యాన్సుల గురించి, డ్యాన్సుల్లో ఆయన ఎనర్జీ, ఈజ్, స్టయిల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మరో వైపు డ్యాన్సుల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న కథానాయిక శ్రీలీల ఈకాంబోలో ప్రత్యేక గీతం అంటే ఇక ఫ్లోర్ ఫైరే... ఈ సాంగ్ పుష్ప-2లో మరో సన్సేషన్ సాంగ్‌గా నిలవబోతుంది.

# పాలకొల్లులో 'భైరవం' సాంగ్ షూట్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ మోస్ట్ ఎవైటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గదా సమర్పిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ పాలకొల్లు లో సాంగ్ షూటింగ్ మొదలుపెట్టారు. హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, హీరోయిన్ అదితి శంకర్ పై క్యూట్ లవ్ సాంగ్ ని చిత్రీకరిస్తున్నారు.బవిజయ్ పోలాకి మాస్టర్ ఈ సాంగ్ కి కొరియోగ్రఫీ చేస్తున్నారు. శ్రీ చరణ్ పాకాల చార్ట్ బస్టర్ ట్యూన్ ని కంపోజ్ చేశారు. మేకర్స్ షేర్ చేసి స్టిల్స్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లుంగీ, షేడ్స్ తో రగ్గడ్ అండ్ మ్యాసీ అవాతర్ లో, హీరోయిన్ అదితి శంకర్ పల్లెటూరి అమ్మాయిగా ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదల లీడ్ యాక్టర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ మూవీలో అదితి శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది హీరోయిన్స్ గా నటిస్తున్నారు.

# మేనల్లుడికి మామ గిఫ్ట్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దగ్గర నుంచి స్పెషల్ గిఫ్ట్ అందుకున్నారు సుప్రీమ్ హీరో సాయిదుర్గ తేజ్. ఇటీవల తనను కలిసిన సాయిదుర్గ తేజ్ కు సావర తెగలు చేసిన పెయింటింగ్ ను అందించారు పవన్ కల్యాణ్. ఈ సందర్భంగా తీసుకున్న ఫొటోను సోషల్ మీడియా ద్వారా సాయిదుర్గ తేజ్ షేర్ చేశారు. సాయిదుర్గ తేజ్ స్పందిస్తూ - మామయ్య పవన్ కల్యాణ్ దగ్గర నుంచి అందుకునే బ్లెస్సింగ్స్ తో పాటు ఆయన ఇచ్చే ప్రతి గిఫ్ట్ ఎంతో ప్రత్యేకమైనది. ఇప్పుడు నేను అందుకున్న ఆర్ట్ వర్క్ సావర ట్రైబ్ ఆర్టిస్ట్స్ తయారు చేసింది. ఏపీ లేపాక్షి షోరూం నుంచి ఈ పెయింటింగ్స్ తీసుకొచ్చారు. ఏపీలోని ఉత్తరాంధ్ర ఏజెన్సీకి చెందిన ఈ సావర ట్రైబ్ నేచురల్ కలర్స్ తో ఈ పెయింటింగ్స్ గీస్తారు. శతాబ్దాల చరిత్ర ఉన్న సావర తెగల వారి కళ అంతరించిపోతోంది. వీరి ఉనికిని కాపాడాలంటే మనమంతా సావర తెగలు తయారుచేసిన పెయింటింగ్స్, ఇతర అలంకరణ వస్తువులు కొనుగోలు చేసి ప్రోత్సహించాలి. పవన్ కల్యాణ్ ఎవరికైనా బహుమతిగా కొండపల్లి, ఏటి కొప్పాక బొమ్మలతో పాటు సావర తెగల పెయింటింగ్స్ ఇస్తారు అని పేర్కొన్నారు.

# రామ్ పోతినేని- మైత్రీ మూవీ మేకర్స్ కాంబో షురూ

ఉస్తాద్ రామ్ పోతినేని కథానాయకుడిగా అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఉదయం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు.

హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మీద చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు గోపీచంద్ మలినేని కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దర్శకుడు హను రాఘవపూడి క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి దర్శకుడు వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర దర్శకుడు మహేష్ బాబుకు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలితో పాటు ఆ సంస్థ సీఈవో చెర్రీ, దర్శకులు గోపీచంద్ మలినేని, హను రాఘవపూడి, వెంకీ కుడుముల, శివ నిర్వాణ, పవన్ సాధినేని స్క్రిప్ట్ అందజేశారు.

యువ సామ్రాట్ నాగ చైతన్య, సాయి పల్లవి లవ్ అండ్ యాక్షన్ డ్రామా 'తండేల్' మ్యూజికల్ ప్రమోషన్లు ప్రారంభమయ్యాయి, మేకర్స్ ఫస్ట్ సింగిల్-బుజ్జి తల్లి లిరికల్ వీడియోను విడుదల చేశారు. హార్ట్ ఫుల్ లవ్ స్టోరీస్ ని తీయడంలో మాస్టర్ అయిన చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ మూవీలోని ఈ సాంగ్ లీడ్ పెయిర్ ఎమోషనల్ జర్నీని అందంగా ప్రజెంట్ చేసింది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన ఈ ట్రాక్ మ్యూజికల్ గా వుంది. ప్లజెంట్ మెలోడీలను క్రియేట్ చేయడంలో మాస్టర్ అయిన దేవి శ్రీ ప్రసాద్ మెస్మరైజింగ్ ట్యూన్‌ని కంపోజ్ చేశారు. ఇది లిజనర్స్ మనసులో నిలిచిపోయేలా వుంది. హీరో తన బాధలో ఉన్న ప్రియురాలిని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నప్పుడు కథలో కీలకమైన సమయంలో ఈ సాంగ్ వస్తుంది. లిరికల్ వీడియో ద్వారా లీడ్ పెయిర్ బాండింగ్ అద్భుతంగా చూపించారు. శ్రీమణి రాసిన లిరిక్స్, తన ప్రేమికురాలిని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్న హీరో భావోద్వేగాలకు కవితాత్మకంగా ప్రజెంట్ చేశాయి. జావేద్ అలీ సోల్ ఫుల్ వోకల్స్ ట్రాక్ కు మరింత డెప్త్ ని యాడ్ చేశాయి.

## ప్రియదర్శి ఇంట్రెస్టింగ్ స్టోరీల్లో

# లీడ్ రోల్స్ చేస్తున్నాడు - విజయ్ దేవరకొండ

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహించిన సినిమా 'సారంగపాణి జాతకం'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. డిసెంబర్ 20న సినిమా విడుదల చేయనున్నారు. సెన్సేషనల్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా టీజర్ విడుదల చేశారు.

విజయ్ దేవరకొండ మాట్లాడుతూ...''నా బ్రదర్ దర్శి (ప్రియదర్శి)తో నా కెరీర్ స్టార్ట్ చేశా. ఇంట్రెస్టింగ్ కథల్లో లీడ్ రోల్స్ చేస్తూ మనకు మంచి సినిమాలు అందిస్తున్నాడు. అతను హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా 'సారంగపాణి జాతకం' టీజర్ ఇప్పుడే చూశాను. అందులో... దర్శి పాత్రకు జాతకాల మీద నమ్మకం ఉంటుంది. జాతకాలు ఎంత నిజం అనేది నాకు తెలియదు. 'పెళ్లి చూపులు' చేసినప్పుడు మేం ఈ స్థాయికి వస్తాం అని ఊహించలేదు. డెస్టినీ మమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చింది. దర్శి జర్నీ చూడటం నాకు ఎంతో హ్యాపీగా ఉంది. 'సారంగపాణి జాతకం' సినిమాకు మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహించారు. ఆయన 'అష్టా చమ్మా' సినిమా చూసి నేను ఎంత నవ్వుకున్నానో చెప్పలేను. అప్పట్లో అది చాలా డిఫరెంట్ కంటెంట్. ఆ మూవీని చాలా ఎంజాయ్ చేశా. అలాగే, శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ ఎప్పటి నుంచో సినిమాలు చేస్తున్నారు. ఎన్నో మంచి సినిమాలు చేశారు. 'సారంగపాణి జాతకం' పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను. మోహనకృష్ణ ఇంద్రగంటికి, శివలెంక కృష్ణ ప్రసాద్ కి ఆల్ ది బెస్ట్" అని చెప్పారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733